నమస్తే తెలంగాణ

# నిజామాబాద్

5 | నిజామాబాద్, గురువారం 25 జనవరి 2024 | NIZAMABAD

## మున్సిపల్ చైర్మన్ ఎన్నిక నిర్వహించండి

ఆర్మూర్‌టౌన్, జనవరి24: ఆర్మూర్ మున్సిపల్ నూతన చైర్మన్ ఎన్నికను వెంటనే నిర్వహించాలని స్థానిక కౌన్సిలర్లు కోరారు. ఈ మేరకు మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ మున్సిపల్ కౌన్సిలర్లు బుధవారం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆర్మూర్‌లో నూతన చైర్మన్ ఎన్నిక చేపట్టకుండా పక్షపాత ధోరణి అవలంబిస్తున్నారని కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారి స్పందించి త్వరలోనే ఎన్నికల తేదీని ప్రకటించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



దాన కిశోర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, కౌన్సిలర్లు

## నెలరోజులపాటు మాధవనగర్ రైల్వేగేటు మూసివేత

డిచ్‌పల్లి, జనవరి 24 : నిజామాబాద్ నగర శివారులోని మాధవనగర్ రైల్వే గేటును నేటి నుంచి నెల రోజులపాటు తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం కొనసాగుతున్న దృష్ట్యా పనులకు ఆటంకం కలుగకుండా గేటును మూసివేస్తున్నామని, ప్రజలు సహకరించాలని కోరారు. నగర ప్రయాణికులు బైపాస్ మీదుగా, డిచ్‌పల్లి మండలవాసులు ముల్లంగి, కులాస్‌పూర్ మీదుగా వెళ్లాలని సూచించారు.




# సంక్షోభంలో నవనాథ ‘పురం’

చైర్‌పర్సన్‌పై అవిశ్వాసానికి మద్దతు పలుకుతున్న కౌన్సిలర్లు (ఫైల్)



- మూడు వారాలుగా స్తంభించిన పాలన
- అవిశ్వాసం నెగ్గినా చైర్మన్ ఎన్నిక నిర్వహించని వైనం
- స్పష్టత ఇవ్వడంలో అధికారుల వైఫల్యం
- సాంకేతిక కారణాలను చూపుతూ సాగదీతలు
- ప్రజాతీర్పును అవహేళన చేస్తున్న యంత్రాంగం
- తెర వెనుక కుటిల రాజకీయం చేస్తోన్న అధికార కాంగ్రెస్




నిజామాబాద్, జనవరి 24 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

ఆర్మూర్ మున్సిపాలిటీలో సంక్షోభం నెలకొంది. కొత్త చైర్మన్‌ను ఎన్నుకోకపోవడంతో పాలన స్తంభించింది. అవిశ్వాసం నెగ్గి 20 రోజులు పూర్తయినా నూతన చైర్మన్ ఎన్నిక ప్రక్రియ చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తున్నది. ఓవైపు తెర వెనుక కాంగ్రెస్ పార్టీ నాయకుల ఒత్తిడి, మరోవైపు అధికార యంత్రాంగం తీరుతో ఎన్నికలో జాప్యం జరుగుతున్నది. కౌన్సిలర్ల విశ్వాసం కోల్పోవడం మూలంగా చైర్‌పర్సన్ వినీత పదవీచ్యుతులయ్యారు. ఈ ఘటన జరిగి దాదాపుగా మూడు వారాలు కావొస్తుంది. అయినప్పటికీ ఈ అంశంపై నిర్ణయం తీసుకోవడంలో జిల్లా యంత్రాంగం పట్టనట్టు వ్యవహరిస్తున్నది.

**నెగ్గిన అవిశ్వాసం..**

పండిత్ వినీతపై కౌన్సిలర్లు కలెక్టర్‌కు అవిశ్వాస నోటీసులు అందించారు. దీంతో జనవరి 4న ఆర్మూర్ ఆర్డీవో అధ్యక్షతన అవిశ్వాస ప్రక్రియ జరిగింది. మొత్తం 36 మంది కౌన్సిలర్లు ఉండగా 24 మంది అవిశ్వాస సమావేశానికి హాజరై పండిత్ వినీతకు వ్యతిరేకంగా ఓటేశారు. దీంతో వినీత పదవి కోల్పోయారు. తదనంతరం ఆర్డీవో నుంచి వచ్చిన నివేదిక సారాంశాన్ని అనుసరించి కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి నివేదికను పంపించారు. అయితే, నూతన చైర్మన్‌ను ఎన్నుకోవాల్సి ఉండగా, ప్రభుత్వం నుంచి స్పందన కరువైంది.

**ప్రజా తీర్పుకు అగౌరవం..**

ఆర్మూర్ మున్సిపాలిటీలో ప్రజల చేత ఎన్నికైన పాలకమండలి మనుగడలోనే ఉంది. కానీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు ప్రజా తీర్పును అపహాస్యం చేసేలా ఉన్నది. కౌన్సిలర్ల అభీష్టం మేరకు నూతన చైర్మన్ నియామకం చేపట్టకపోవడం ద్వారా కార్యనిర్వాహక వ్యవస్థ చేతిలోకి పాలన పగ్గాలు వెళ్తున్నాయి. తద్వారా ప్రజా ప్రతినిధుల అధికారాలు, వారు నిర్వర్తించాల్సిన విధులు సుప్తావస్థకు చేరుకున్నట్లుగా మారింది. చట్టాన్ని గౌరవించాల్సిన వాళ్లే చిన్న చిన్న సాంకేతిక కారణాలను చూపి చైర్మన్ ఎన్నికను పక్కన పెట్టడాన్ని ప్రజలు తీవ్రంగా తప్పుబడుతున్నారు. అవిశ్వాస సమావేశంలో నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి సైతం పాల్గొన్నారు. ఒక వేళా ఆయన ఓటు హక్కు విషయంపై అభ్యంతరాలు ఉంటే పురపాలక శాఖ త్వరగా తేల్చాలి. కానీ ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో ఈ అంశాన్ని తొక్కి పెట్టినట్లు అర్థమవుతున్నది. ఎమ్మెల్యే ఓటుతో పురపాలక చైర్మన్ అవిశ్వాస తీర్మానం ఓడిపోయే అవకాశం కూడా లేదు. ఎందుకంటే 36 మందిలో 24 మంది కౌన్సిలర్లు ఏకపక్షంగా అవిశ్వాసాన్ని బలపర్చారు. అయినప్పటికీ ఏదో సాంకేతిక కారణం చూపి చైర్మన్ ఎన్నిక ఆపడంపై గందరగోళం నెలకొన్నది. ఆర్మూర్‌లో జరిగిన అవిశ్వాస తీర్మాన సమావేశం అనంతరం రాష్ట్రంలో అనేక చోట్ల అవిశ్వాసాలు జరిగాయి. అక్కడ చైర్మన్ ఎన్నికలు సైతం ముగిసినా ఇక్కడ మాత్రం ఎలాంటి నిర్ణయం తీసుకోక పోవడం కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాన్ని ప్రస్ఫుటం చేస్తున్నది.

**అధికార యంత్రాంగం వైఫల్యం..**

ప్రభుత్వ పనితీరుకు అధికార యంత్రాంగం పనితీరు దర్పణంగా నిలుస్తుంది. ఆర్మూర్ మున్సిపాలిటీ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం నెగ్గిన తర్వాత జరుగుతున్న పరిణామాలు ఆశ్చర్యానికి గురి చేస్తున్నాయి. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా అధికార యంత్రాంగం వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు తావిస్తున్నది. కారణాలు ఏ విధంగా ఉన్నప్పటికీ కౌన్సిలర్ల విశ్వాసాన్ని కోల్పోయిన చైర్‌పర్సన్ స్థానంలో చట్టబద్ధంగా కొత్తవారిని ఎన్నుకునేందుకు పురపాలక సమావేశం నిర్వహించాలి. కానీ ఈ వ్యవహారంలో మాత్రం తాత్సారం జరుగుతుండడం విడ్డూరంగా మారింది. ఈ తతంగం వెనుక కాంగ్రెస్ పార్టీ నాయకుల హస్తం ఉన్నట్లు కౌన్సిలర్లు చెబుతున్నారు. ఆర్మూర్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీకి బలమే లేదు. కేవలం ఒకే ఒక కౌన్సిలర్ ఉన్నారు. అయితే, ఇప్పుడు రాష్ట్రంలో అధికారంలో ఉండడం, ఆర్మూర్ బల్దియాలో చోటు చేసుకున్న పరిణామాలను సొమ్ము చేసుకోవాలనే ఆలోచనతో కాంగ్రెస్ కుటిల రాజకీయాలకు పాల్పడుతున్నట్లు ప్రచారం జరుగుతున్నది. ఈ వ్యవహారంలో రాజకీయ నాయకులకు వత్తాసు పలుకకుండా చట్టం ప్రకారం పని చేయాల్సిన ప్రభుత్వ యంత్రాంగం చేష్టలుడిగి చూస్తుండడంతో బల్దియాలో పాలన స్తంభించింది.

## హామీలు అమలు చేయకుంటే పోరాటమే

- రైతుబంధు రూ.15వేలు, రూ.2లక్షల రుణమాఫీ చేయాలి
- మహిళలకు ప్రతినెలా రూ.2500 చెల్లించాలి
- బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి
- పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం

భీమ్‌గల్, జనవరి 24 : ఎన్నికల సందర్భంగా గ్యారెంటీల పేరిట కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఆశ జూపిందని, ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. లేదంటే ప్రజల పక్షాన పోరాడుతామన్నారు. నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండలంలో బుధవారం పర్యటించి రూ. కోటీ 15లక్షల నిధులో పూర్తిచేసిన పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. జాగిర్యాల్, పల్లికొండ, పిప్రి గ్రామాల్లో నిర్మించిన హెల్త్ సబ్‌సెంటర్లు, రూప్లాతండా, దేవన్‌పల్లి, లింగాపూర్‌లో నూతన గ్రామ పంచాయతీ భవనాలు, బడాభీమ్‌గల్‌లో బస్సు షెల్టర్, భవనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన ప్రతి హామీనీ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో మంజూరు చేసి నిర్మించుకున్న గ్రామ పంచాయతీలు, హెల్త్ సబ్‌సెంటర్లను ప్రారంభించుకోవడం సంతోషకరమని అన్నారు. ప్రతి హెల్త్ సబ్‌సెంటర్‌లో ఎంబీబీఎస్ డాక్టర్‌ను నియమించాలని అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి విన్నవించగా, కేసీఆర్ అంగీకరించారని గుర్తుచేశారు. ఆ మేరకు సబ్‌సెంటర్లలో నియామకాలు చేపట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు. గ్యారెంటీల పేరిట కొత్త ప్రభుత్వం ఎన్నో ఆశలు పెట్టిందని వేముల అన్నారు. ఎకరానికి రూ.15వేల చొప్పున రైతుబంధు, రూ. 2 లక్షల రుణమాఫీ వెంటనే అమలు చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే కరెంట్ బిల్లులు మాఫీ చేస్తామని ప్రకటించారని, కానీ నేడు ఇంటింటికీ వెళ్లి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రూ. 500లకే గ్యాస్ సిలిండర్, మహిళలకు ప్రతినెలా రూ.2,500 అందజేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి గుర్తు చేశారు. హామీలు అమలు చేయకపోతే ప్రజల పక్షాన పోరాడుతామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మహేశ్, జడ్పీటీసీ రవి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నర్సయ్య, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేశ్, పంచాయతీరాజ్ శాఖ అధికారి రాజేశ్వర్ పాల్గొన్నారు.




జాగిర్యాల్‌లో పల్లె దవాఖానను ప్రారంభించిన అనంతరం వైద్య సిబ్బందితో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

## లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటాలి

సదాశివనగర్, జనవరి 24: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో జహీరాబాద్ స్థానం నుంచి పోటీచేసే బీఆర్‌ఎస్ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించి సత్తా చాటాలని ఎంపీ బీబీపాటిల్ పిలుపునిచ్చారు. ఇందుకోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని కోరారు. సదాశివనగర్ - రామారెడ్డి మండలాల కార్యకర్తల సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా బీబీపాటిల్ హాజరై దిశానిర్దేశం చేశారు. తెలంగాణ వచ్చిన నాటి నుంచి కేసీఆర్ ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను వంచించి అధికారంలోకి వచ్చిందని, అయినప్పటికీ నెలన్నరలోనే నమ్మకం కోల్పోయిందన్నారు. కాంగ్రెస్‌ను తిరస్కరించే రోజులు వచ్చాయన్నారు. మాటలతో కాకుండా చేతల నాయకులను ప్రజలు మర్చిపోరని అన్నారు. కష్టకాలంలో పార్టీ కార్యకర్తలు, ఎల్లారెడ్డి నియోజకవర్గ ప్రజలకు అండగా ఉండడంతోపాటు పారిశ్రామికవేత్తల నుంచి నిధులు తెచ్చి స్థానిక సమస్యలను పరిష్కరించానని గుర్తుచేశారు. కేసీఆర్ మార్గాన్ని అనుసరిస్తూ సేవచేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నానన్నారు. జహీరాబాద్ పరిధిలో రూ. 5వేల కోట్లతో నేషనల్ హైవే, ప్రధానమంత్రి సడక్ యోజన కింద రూ. 78 కోట్లతో రోడ్లు నిర్మించడంతోపాటు రూ. 12వందల కోట్లతో బోధన్-బీదర్ రైల్వే లైన్ మంజూరు చేయించానని వివరించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు మహేందర్‌రెడ్డి, రవీందర్‌గౌడ్, జడ్పీటీసీ నరసింహులు, ఎంపీపీ అనసూయ, మాజీ జడ్పీటీసీ రాజేశ్వర్‌రావు, ఏఎంసీ చైర్మన్ సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ బీబీ పాటిల్

## మేమెట్ల బతికేది..

- మహాలక్ష్మి పథకంతో జీవనోపాధి కోల్పోయాం
- నెలకు రూ.15వేలు జీవనభృతి ఇవ్వాలి
- కామారెడ్డిలో ఆటో డ్రైవర్ల భారీ నిరసన ర్యాలీ



కామారెడ్డిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆటో డ్రైవర్లు

కామారెడ్డి, జనవరి 24: కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో జీవనోపాధి కోల్పోయామని, మా కుటుంబాలు రోడ్డున పడ్డాయని, ప్రభుత్వమే తమను ఆదుకొని నెలకు రూ.15వేల జీవనభృతి ఇవ్వాలని ఆటో డ్రైవర్లు డిమాండ్ చేశారు. ఆటో యూనియన్ ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లాలో కేంద్రంలో బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 20వేల మంది ఆటోలు నడుపుతున్నారని, కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం మహాలక్ష్మి పథకంలో భాగంగా ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో ఆటోల్లో ఎవరూ ప్రయాణించడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. దీంతో తాము ఆటో ఫైనాన్స్‌లు, ఇంటి కిరాయిలు, పిల్లల స్కూల్ ఫీజులు కట్టుకోలేక పోతున్నామని, ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. జిల్లా కేంద్రంలో ఆటోనగర్ కాలనీ ఏర్పాటు చేసి ఆరు ఎకరాల స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి జీవో విడుదల చేయాలని, 60శాతం సబ్సిడీతో బ్యాంకు రుణాలు ఇప్పించాలని అన్నారు. ప్రమాదవశాత్తు లేదా అనారోగ్యంతో మరణిస్తే ప్రభుత్వం నుంచి రూ.5లక్షలు ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఆటో డ్రైవర్లకు లేబర్ కార్డులు ఇవ్వాలని, ఆటోబంధు పథకం అమలు చేయాలన్నారు. తమ డిమాండ్లు పరిష్కరించకపోతే భవిష్యత్తులో ఆందోళనలు తీవ్రతరం చేస్తామన్నారు. సీఎస్ఐ గ్రౌండ్‌లో మొదలైన ర్యాలీ నిజాంసాగర్ చౌరస్తా మీదుగా హైవే రోడ్డు వరకు కొనసాగింది. యూనియన్ జిల్లా అధ్యక్షుడు బోదాస్ నర్సింహులు, ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణ, కోశాధికారి గోల్కొండ రాజయ్య, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

# మత్తు.. యువత చిత్తు

### నందిపేట్‌లో గంజాయి ఘాటు

- పాన్ షాపులు, హోటళ్లే అడ్డాలు
- బహిరంగంగా విక్రయాలు
- అర్ధరాత్రి వరకూ రోడ్లపైనే యువత
- మండలంలో పెరిగిన చోరీలు



**అక్రమ సంపాదన** కోసం కొందరుయువ తను మత్తులో ముంచుతూ వారిభ విష్యత్తును చిత్తు చేస్తున్నారు.చదు వుకునేవయ స్సులోనే గంజాయివైపు మళ్లించి మత్తుకు బానిసలుగామా రుస్తున్నారు.ఎక్క డ పడితే అక్కడ, ఎప్పుడు పడితే అప్పుడు అందుబాటులో ఉంచడంతో యువకులు చెడు వ్యసనం బారిన పడుతున్నారు. గంజాయి లేకుండాఉ ండలేకపోతున్నారు. ఇందుకోసం ఎన్ని డబ్బులైనాఖర్చు చేస్తున్నారు.

–నందిపేట్,జ నవరి2 4

గంజాయి వ్యాపారానికి నందిపేట్ అడ్డాగా మారింది. కొద్ది రోజుల వ్యవధిలోనే రెండు సార్లు గంజాయి పట్టుబడడం మండలంలో కలకలం రేపుతున్నది. ఇటీవల ఎనిమిదిన్నర కిలోలు పట్టుపడగా, తాజాగా బుధవారం మూడున్నర కిలోల గంజాయి పట్టుబడింది. నందిపేట్ మండల కేంద్రంలో కొన్ని పాన్ షాపులు, చాయ్ హోటళ్లు గంజాయి విక్రయాలకు అడ్డాగా మారాయి. ఉమ్మెడ వద్ద గోదావరి నదిపై వంతెన నిర్మించిన తర్వాత మహారాష్ట్ర ప్రాంతానికి రాకపోకలు పెరిగాయి. నిత్యం వందలాది వాహనాలు వస్తూ పోతుంటాయి. అప్పటినుంచి గంజాయి రవాణా పెరిగింది. దీంతోపాటు చోరీలు కూడా పెరిగాయి. నిత్యం ఏదో ఓ చోట దొంగతనం లేదా బైక్ అపహరణ ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. చోరీ చేసిన బైక్‌లను సునాయసంగా వంతెన మీదుగా రాష్ట్రాన్ని దాటిస్తున్నారు.

**నిర్మానుష్య ప్రాంతాల్లో..**

గంజాయి సేవించేవారు నిర్మానుష్య ప్రాంతాలును ఎంచుకొని గుంపులుగా వెళ్లి అక్కడ గంటలపాటు గడుపుతున్నారు. జన సంచారం లేకపోవడంతో భయం లేకుండా గంజాయి సేవిస్తున్నారు. ఉమ్మెడ గుట్ట ప్రాంతం, లక్కంపల్లి శివారులోని సెజ్ సమీపంలోని అంతర్గత రోడ్లు, మైదాన ప్రాంతాల్లోకి వెళ్లి మత్తులో జోగుతున్నారు. వివేకానంద చౌరస్తా, ఆర్మూర్ బైపాస్ రోడ్డు ప్రాంతాలతోపాటు పలు పాన్ షాపులు, హోటళ్లు, వైన్ షాపులకు సమీపంలో గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం. ప్రధానంగా 20 నుంచి 25 ఏండ్లలోపు యువకులే గంజాయికి బానిసలుగా మారారని తెలుస్తున్నది. ఇద్దరు ముగ్గురు కలిసి గంజాయిని కొనుగోలు చేసుకొని నిర్మానుష్య ప్రాంతానికి వెళ్లిపోతున్నారు.

**అర్ధరాత్రి వరకూ రోడ్లపైనే..**

పని లేకున్నా యువకులు అర్ధరాత్రి వరకూ రోడ్లపైనే కనిపిస్తున్నారు. ప్రత్యేకంగా అడ్డాలను ఏర్పాటుచేసుకొని రాత్రి ఒంటిగంట వరకు అక్కడే తిష్ట వేసుకొని కూర్చుంటున్నారు. ఆర్మూర్ బైపాస్ రోడ్డు, హనుమాన్‌గల్లీ, రాజానగర్ ప్రాంతలోని చిన్నచిన్న కిరాణా దుకాణాలను అర్ధరాత్రి రాత్రివరకూ తెరిచి ఉంచుతున్నారు. దీంతో కొందరు ఆయా ప్రాంతాల్లో మకాం వేసుకొని ఉండిపోతున్నారు. రోడ్డు పక్కన ఉండే కల్వర్టుల వద్ద అడ్డాలు వేస్తున్నారు. హనుమాన్ గల్లీని ఓ వాటర్ ప్లాంట్, డీజే సెంటర్ ఉన్న చోట నిత్యం పదుల సంఖ్యలో యువకులు రాత్రి రెండు గంటలవరకూ తిరుగుతున్నారు. స్థానికులు వారిని నిలదీసినా తీరుమారడం లేదని అంటున్నారు.

**పెరిగిన చోరీలు**

నందిపేట్‌లో రోజురోజుకూ చోరీలు పెరుగుతున్నాయి. వారంలో నాలుగైదు ద్విచక్రవాహనలు అపహరణకు గురవుతున్నాయి. వివేకానంద చౌరస్తాలో పార్క్‌చేసిన ఓ బైక్‌ను దొంగలు పట్టపగలే చోరీకి ప్రయత్నించారు. నిందితులను పట్టుకొని దేహశుద్ధి చేశారు. గత నెల అంగడి రోజు మూడు బైక్‌లను దొంగలు ఎత్తుకెళ్లారు.



నందిపేట్‌లో పోలీసులు పట్టుకున్నగంజాయి

### మూడున్నర కిలోల గంజాయి పట్టివేత

నందిపేట్ మండల కేంద్రంలోని వివేకానంద చౌరస్తా వద్ద పోలీసులు బుధవారం వాహనాలను తనిఖీ చేస్తుండగా మూడున్నర కిలోల గంజాయి పట్టుబడింది. నిజామాబాద్ నగరంలోని గౌతంనగర్‌కు చెందిన జిలకర ప్రసాద్, విద్యాసాగర్ బైక్‌పై గంజాయి తరలిస్తుండగా పట్టుబడ్డారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆర్మూర్ రూరల్ సీఐ గోవర్ధన్‌రెడ్డి, ఎస్సై రాహుల్ తెలిపారు.

**పెద్దకొడప్‌గల్‌లో 800 గ్రాములు..**

పెద్దకొడప్‌గల్, జనవరి 24: మండలంలోని అంజని గ్రామానికి చెందిన నర్మల్ హన్మాండ్లు ఇంట్లో 800 గ్రాముల ఎండు గంజాయిని పట్టుకున్నట్లు అబ్కారీ సీఐ సత్యనారాయణ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు బిచ్కుంద అబ్కారీ పోలీసులు బుధవారం దాడి చేసి పట్టుకున్నారు. కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఆయన వెంట అబ్కారీ ఎస్సై అభిశేఖర్,హెడ్ కానిస్టేబుల్ ఎల్లయ్య, కానిస్టేబుల్ పరశురాం,నవీన్ రెడ్డి, శ్రీధర్, అనిత, ప్రేమలత ఉన్నారు.

## మహీంద్రా ఎలక్ట్రికల్ కారు ఆవిష్కరణ



డిచ్‌పల్లి సమీపంలోని మహీంద్రా షోరూంలో ఎక్స్‌యూవీ -400 ఎలక్ట్రికల్ కారును డీటీవో వెంకటరమణ, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమారాజ్, కంపెనీ ఏరియా సేల్స్ మేనేజర్ వంశీ బుధవారం ఆవిష్కరించారు.

– ఖలీల్‌వాడి, జనవరి 24

## అస్ట్రోమెడ్ డయాగ్నోస్టిక్ సెంటర్ ప్రారంభం



నిజామాబాద్ నగరంలోని తిరుమల టాకీస్‌రోడ్డులో ఏర్పాటు చేసిన అస్ట్రోమెడ్ డయాగ్నోస్టిక్ సెంటర్‌ను రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి బుధవారం ప్రారంభించారు. అత్యాధునిక పరికరాలు అందుబాటులో ఉన్నట్లు యాజమాన్యం తెలిపింది.

– ఖలీల్‌వాడి, జనవరి 24